# సాధనా శూరులు

"సాధన" అంటే సాధించడం ద్వారా "శూరులు" అనిపించుకున్న కళాకారులు. సాధనాశూరులు కళ ఇంద్రజాలవిద్యతో కూడిన అతిప్రాచీనకళ. కానీ వీరు తమ కళను ఇంద్రజాలమంటే ఒప్పుకోరు. సాధన ద్వారా తాము వాయుస్థంభన, జలస్థంభన, విద్యలు మరియు యోగా ద్వారా కొన్ని సిద్ధులనుపొంది తమ కళను ప్రదర్శించుచున్నట్లుగా చెప్పకుంటారు. ఈ కళకు ఆద్యులు భావనాఋషి అని చెప్పబడుతోంది. భట్టీవిక్రమార్కునికథలో వీరి గురించి ప్రస్థావించబడింది. కాకతీయుల కాలంలో ఈ కళకు మంచి ఆదరణ లభించిందని తెలుస్తోంది. వీరు కాళికాదేవి ఉపాసన చేసి ఆ దేవి కటాక్షంవలన ఈ విద్యలను అభ్యసించినారని ప్రతీతి. వీరు పద్మశాలీ కులంలోని ఒక తెగకుచెందినవారు. వీరు వారి కళను ప్రదర్శించి తద్వారా వచ్చుపారితోషికం తీసుకొని జీవనం చేస్తున్నారు. శ్రీనాధుని క్రీడాభిరామంలో కూడా వీరి ప్రస్థావన ఉన్నది. వీరి ప్రదర్శనలో ముఖ్యాంశాలు (1) కర్రసాము (2) త్రాడుసాము (3) పొడిగా ఉన్న యిసుకను నీటితో తడిపి మరల పొడిగా చేయుట (4) పొట్టపైన 80 కిలోల రాయిని పెట్టి పెద్ద సుత్తితో పగలకొట్టుట. కానీ రాయి మోయుచున్న మనిషికి ఏవిధమైన చిన్నదెబ్బకూడా తగలదు. ఇందుకు కారణం వాయుస్థంభనవిద్య నేర్చుకొనుట అని చెప్పెదరు (5) దేవతా విగ్రహాలను సృష్టించి మరల మాయంచేయుట (6) వ్యక్తి తలపై నిప్పు పెట్టి పూరీలు చేయుట (7) చొప్పదంట్లతో చేసిన పల్లకిలో మనిషిని కూర్చొనబెట్టి మోయుట మొదలయిన ఎన్నో గగుర్పాటు కలగచేయు అంశాలు కలవు. ఈ ప్రదర్శనలకు నగారా వాద్య సహకారముండును.

ఈ కళాకారులు కరీంనగర్ జిల్లాలో మాత్రమే ఉన్నారు. అవి కూడా రెండు బృందాలు మాత్రమే ఉన్నాయి. బృందానికి 12 మంది కలరు. ప్రస్తుతం 5 మందితో కల ఒక బృందం శ్రీ బండి శంకర్ నేతృత్వంలో ప్రదర్శనలు యిస్తున్నారు. వీరిది కరీంనగర్ జిల్లా, సుల్తానాబాద్ మండలం, పూసాల గ్రామానికి చెందినవారు. ఇంకొక బృందం కరీంనగర్ జిల్లాలోని చల్లూరు గ్రామంలో ఉన్నారు. సాధనా శూరుల యొక్క ప్రత్యేక ప్రదర్శన "దేవతా విగ్రహాలు సృష్టించుట" మరియు విగ్రహాలు మాయం చేయుట. ఇంతవరకు ఏ మెజీషియన్ కూడా ఈ విద్య ప్రదర్శించుట లేదు. ఈ ప్రదర్శనలో 50 విగ్రహాలను పుట్టించి వాటిని మాయం చేయుట జరుగుతుంది. నాలుగు గడకర్రలుపాతి దానిచుట్టూ పరదాకడతారు. గడ్డపార ఆధారంతో విగ్రహాలు పెట్టేందుకు అనువుగా పీటలు పెడతారు. విగ్రహాలు ఆరు అడుగులు, నాలుగు అంగుళాలు, మూడు అంగుళాలు

ఉంటాయి. చుట్టూ ఉన్న తెరలు తీసివేయగానే విగ్రహాలు మాయమవుతాయి.

2001 వ సంవత్సరంలో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో ప్రదర్శన చేసినపుడు ఆ ప్రదర్శన చూసిన శ్రీ పి.సి. సర్కార్ (జూనియర్) ముగ్ధులై శ్రీ బండి శంకర్ కు సన్మానం చేయడమైంది. వీరు స్టేజీమీదకన్నా నాలుగు రోడ్ల కూడలిలో ప్రదర్శనలు చేయుటకు ఇష్టపడతారు. కళాకారుడు అంతమంది మధ్యలో ఉండికూడా యెవ్వరికీ కనపడకుండా వేరేచోటికి తప్పించుకొని వెళ్లగలరు. వీరు తమ ప్రదర్శనను బహిరంగంగా నాలుగు రోడ్లకూడలిలో చేస్తారు.